సాక్షి
యాదాద్రి భువనగిరి

బుధవారం । 24 । జనవరి । 2024



గంజాయి పట్టివేత

గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరు యువకులను చౌటుప్పల్ పోలీసులు అరెస్ట్ చేశారు. -10లో



చేనేత వస్త్రాలు బాగున్నాయి

పోచంపల్లి ఇక్కత్ చేనేత వస్త్రాలు, డిజైన్లు బాగున్నాయని ఇంగ్లండ్ దేశస్తులు కితాబునిచ్చారు. - 12లో



భాగస్వాములు కావాలి

గ్రీన్ ఇండియా సాధనలో విద్యార్థులు భాగస్వాములు కావాలని అదితి గోయల్ అన్నారు. - 12లో

న్యూస్‌రీల్

రేపు ఇంటర్వ్యూలు

భువనగిరి : ప్రైవేట్ కంపెనీ ఉద్యోగాల కోసం గురువారం నిరుద్యోగులకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధికల్పనాధికారి సాహితి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 30 సేల్స్ ఎగ్జిక్యూటివ్ పోస్టులకు ఎస్సెస్సీ, 2గ్రూప్ లీడర్ పోస్టులకు డిగ్రీ అర్హత కలిగి ఉండాలని తెలిపారు. అర్హత, ఆసక్తి గల నిరుద్యోగులు ఈ నెల 25న ఉదయం 11గంటలకు విద్యార్హత ధ్రువీకరణ జిరాక్స్ పత్రాలతో జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయంలో నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని ఆమె కోరారు.

గణతంత్ర వేడుకల ఏర్పాట్లు పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న భాస్కర్‌రావు

భువనగిరిటౌన్ : భువనగిరి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గణతంత్ర వేడుకల ఏర్పాట్లను మంగళవారం జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ భాస్కర్ రావు పరిశీలించారు. ఏర్పాట్లను పకడ్బందీగా చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో భువనగిరి రెవెన్యూ డివిజనల్ అధికారి అమరేందర్, జిల్లా యువజన అధికారి ధనుంజయ్, అసిస్టెంట్ పోలీస్ కమిషనర్ వెంకట్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి, తహసీల్దార్ అంజిరెడ్డి తదితరులు ఉన్నారు.

అసంపూర్తి పనులు పూర్తి చేయాలి

భువనగిరిటౌన్ : జిల్లాలోని వివిధ శాఖల కింద చేపడుతున్న అసంపూర్తి పనులను పూర్తి చేయాలని జిల్లా పరిషత్ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి సూచించారు. మంగళవారం స్థానిక జెడ్పీ కార్యాలయ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ఆర్థిక, పనులు, విద్య, వైద్యం స్థాయీ సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. కొన్ని అభివృద్ధి పనులు గడువు ముగిసినా పూర్తి కాకపోవడంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదన్నారు. మోటకొండూరు, మోత్కూరు, ఆలేరు మండలాల్లో అసంపూర్తిగా నిలిచిపోయిన రోడ్డు నిర్మాణ పనులను ఎన్నికల కోడ్‌కు ముందుగానే పూర్తి చేయాలన్నారు. వైద్య సిబ్బంది సమయపాలన పాటించకపోవడంతో పీహెచ్‌సీలలో రోగులకు సరైన రీతిలో వైద్య సేవలు అందడం లేదని జెడ్పీ ఫ్లోర్‌లీడర్ డాక్టర్ కుడుదుల నగేష్ ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో పల్లా వెంకట్‌రెడ్డి, జెడ్పీ సీఈఓ సీహెచ్ కృష్ణారెడ్డి, డిప్యూటీ సీఈఓ శ్రీనివాస్‌రావు తదితరులున్నారు.

యాదాద్రిలో సంప్రదాయ పూజలు

యాదగిరిగుట్ట రూరల్: యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మంగళవారం సంప్రదాయ పూజలు కొనసాగాయి. శ్రీ ఆంజనేయస్వామికి ఆచార్యులు ఆకు పూజలను విశేషంగా నిర్వహించారు. ప్రధానాలయంతో పాటుగా, విష్ణుపుష్కరిణి వద్ద, పాతగుట్ట ఆలయంలో ఆంజనేయస్వామిని, సింధూరం, పాలతో అభిషేకించారు. అనంతరం తమలపాకులతో అర్చించారు. ప్రధానాలయంలో స్వయంభూవులకు నిత్య కైంకర్యాలు నిర్వహించారు. వివిధ విభాగాల ద్వారా స్వామి వారికి రూ. 18,88785 ఆదాయం సమకూరిందని, ఆలయ అధికారులు వెల్లడించారు.

ఆలయ ఉద్యోగులకు క్రీడాపోటీలు

గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయ అధికారులకు మంగళవారం క్రీడా పోటీలు నిర్వహించారు. అవుట్ డోర్ ఆటలతో పాటు, ఇండోర్ ఆటలను ప్రారంభించారు. దీనిలో భాగంగా క్రికెట్‌లో ఏఈఓ శ్రవణ్ కుమార్ జట్టు విజయం సాధించింది. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు రమేష్ బాబు, భాస్కర్ శర్మ ఎస్‌పీఎఫ్ సిబ్బంది రామక్రిష్ణ, నగేష్, రాకేష్, అశ్విని పాల్గొన్నారు.

ఫిబ్రవరి 9న అవిశ్వాసం ?

మోత్కూరు : మోత్కూరు మున్సిపల్ చైర్‌పర్సన్ తీపిరెడ్డి సావిత్రిమేఘారెడ్డి (బీఆర్‌ఎస్)పై వచ్చే నెల 9న ఉదయం 11గంటలకు మున్సిపల్ కార్యాలయంలో అవిశ్వాస తీర్మానం పెడుతున్నట్లు కలెక్టర్ హన్మంతు కె జెండగే ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిసింది. అవిశ్వాస తీర్మానం ఉత్తర్వులను సదరు కౌన్సిలర్లకు పంపినట్లు సమాచారం. ఈ నెల 20న మున్సిపల్ చైర్‌పర్సన్ సావిత్రిపై అవిశ్వాస తీర్మానంపై సంతకాలు చేసిన కాపీని జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అందజేశారు. మొత్తం 12మంది కౌన్సిలర్లు ఉండగా అందులో 9మంది బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు, ముగ్గురు కాంగ్రెస్ కౌన్సిలర్లు సంతకాలు చేశారు. అదే రోజు నుంచి 9 మంది కౌన్సిలర్లు క్యాంపునకు వెళ్లినట్లు తెలిసింది.

పేదల ఇళ్లు.. శిథిల గూళ్లు!

పేదలకు దక్కని గృహయోగం

- పెద్ద సంఖ్యలో మంజూరు చేసినా నిర్మాణంలో విఫలం
- కొన్ని చోట్ల పూర్తయినా.. లబ్ధిదారులకు పంపిణీ చేసింది అరకొరే
- పలు ప్రాంతాల్లో మధ్యలోనే నిలిచిన పనులు
- మౌలిక సదుపాయాలు కల్పించడంలో అలసత్వం
- ఆనవాళ్లు కోల్పోతున్న డబుల్ బెడ్‌రూం ఇళ్లు

సాక్షి ప్రతినిధి, నల్లగొండ : పేదలకు ఇవ్వాల్సిన డబుల్ బెడ్‌రూం ఇళ్లు శిథిల గూళ్లుగా మారుతున్నాయి. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో మంజూరు చేసిన ఇళ్ల నిర్మాణాలు పలు చోట్ల మధ్యలోనే నిలిచిపోయి పేదలకు ఉపయోగపడడం లేదు. కొన్ని చోట్ల నిర్మాణాలు పూర్తి కాగా, చాలా చోట్ల పనులే ప్రారంభానికి నోచుకోలేదు. ఇంకొన్ని చోట్ల కాంట్రాక్టర్లు మధ్యలోనే పనులు వదిలేశారు. ఇక, నిర్మాణాలు పూర్తయిన ఇళ్లను లబ్ధిదారులకు ఇవ్వకపోవడం, వివిధ దశల్లోనే మిగతా ఇళ్ల పనులు నిలిచిపోవడంతో అవి శిథిలావస్థకు చేరాయి. గోడలు బీటలు వారి, వాటిల్లో మొక్కలు మొలిచాయి. కిటికీలు, అద్దాలు పగిలిపోయి, తలుపులు చెదలు పడుతున్నాయి. ఇళ్ల సముదాయంలో కంపచెట్లు కూడా పెరిగిపోయి ఆనవాళ్లు కోల్పోతున్నాయి. చివరకు అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారుతున్నాయి.

ప్రజాధనం వృథా

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పెద్ద మొత్తంలో ఇళ్లను మంజూరు చేసిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం పనులను ప్రారంభించడంలో మాత్రం వెనుకంజ వేసింది.



బీబీనగర్‌లో నిలిచిపోయిన డబుల్ బెడ్ రూం ఇళ్లు

కొన్నిచోట్ల మాత్రమే పనులు ప్రారంభించినా వాటిని పూర్తి చేయలేదు. నిర్మించిన ఇళ్లను సైతం పూర్తిస్థాయిలో లబ్ధిదారులకు ఇవ్వలేదు. దీంతో రూ.కోట్ల ప్రజాధనం వృథాగా మారుతోంది.

ఆలేరులో లబ్ధిదారులకు ఇచ్చింది 232 ఇళ్లే..

ఆలేరు నియోజకవర్గానికి దాదాపు 1500 ఇళ్లను మంజూరు చేసినా అందులో నిర్మాణాలు చేపట్టినవి కేవలం 454 ఇళ్లే. అందులోనూ నిర్మాణాలను పూర్తి చేసి లబ్ధిదారులకు 232 ఇళ్లనే అప్పగించారు. మరో 222 ఇళ్ల నిర్మాణాలు ఇంకా పూర్తి చేయలేదు. ఆలేరు మున్సిపాలిటీ పరిధిలో 64 డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను నిర్మించి పంపిణీ చేశారు. ఆత్మకూరు(ఎం) మండలంలోని ఉప్పలపహాడ్‌లో 45డబుల్ బెడ్ రూమ్‌లను నిర్మించి కేటాయించినా మౌలిక సదుపాయాలు కల్పించకపోవడంతో నివాసాల్లో ఉండలేక పోతున్నారు. పంపిణీ చేసిన అనంతరమే విద్యుత్ సౌకర్యం కోసం స్తంభాలను నాటి తీగలు బిగించారు. అక్కడ సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసినా కనెక్షన్ ఇవ్వలేదు. రోడ్లు కూడా నిర్మించక పోవడంతో గడ్డి మొలిచి పాడుపడిన ఇళ్లలా మారిపోయాయి. యాదగిరిగుట్ట మండలంలోని వంగపల్లిలో 40 ఇళ్లు కట్టినా లబ్ధిదారులకు ఇవ్వలేదు. గుండాల మండలంలో అంబాల గ్రామంలో 20, మాసాన్‌పల్లిలో 20, గుండాలలో 40 ఇళ్లు మంజూరు చేసినా నిర్మాణాలు చేపట్టలేదు. రాజాపేట మండల కేంద్రంలోనూ అదేపరిస్థితి నెలకొంది.

భువనగిరిలో లబ్ధిదారులకు ఇవ్వని ఇళ్లు

భువనగిరి నియోజకవర్గంలో ఇంతవరకు లబ్ధిదారులకు ఇళ్లను కేటాయించలేదు. మండలంలోని సింగన్నగూడెం వద్ద 444 ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేశారు. అందులో 418 ఇళ్లకు డ్రా పద్ధతిలో లబ్ధిదారులను ఎంపిక చేసినా వారికి అప్పగించలేదు. దీంతో అవన్నీ నిరుపయోగంగా మారాయి. హుస్నాబాద్ సమీపంలో 114 ఇళ్ల నిర్మాణం చేపట్టినా స్లాబు దశలోనే ఆగిపోయాయి. బీబీనగర్‌లో 30 ఇళ్లను నిర్మించినా వారిని కేటాయించలేదు. భూదాన్‌పోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని శ్రీ బస్వలింగేశ్వర కాలనీ సమీపంలో 120, జిబ్లక్‌పల్లిలో 36 ఇళ్లను నిర్మించారు. అయినా, వాటిని లబ్ధిదారులకు కేటాయించలేదు. వాటిల్లో మౌలిక సదుపాయాలు కల్పించలేదు. దీంతో ఆకతాయిలు ఆయా ఇళ్ల కిటికీ అద్దాలు, తాగునీటి సింటెక్ ట్యాంకులను ధ్వంసం చేశారు. బాత్‌రూమ్‌లలో టాయ్‌లెట్ కుండీలను గులకరాళ్లతో నింపారు. డబుల్‌రూమ్ ఇళ్లలో రాత్రివేళలో మద్యంసేవించడం, ఇతర అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి.

డబుల్ బెడ్‌రూం ఇళ్ల పరిస్థితి ఇలా..

జిల్లా	మంజూరు	పనులు ప్రారంభించినవి	పూర్తయినవి
నల్లగొండ	8,155	3,300	2,600
సూర్యాపేట	5,424	3,624	3,166
యాదాద్రి	3,620	1300	829

వీటిలో కొన్నింటిని మాత్రమే లబ్ధిదారులకు కేటాయించారు.

మునుగోడులో రెండు చోట్లనే ఇళ్లు

మునుగోడు నియోజకవర్గంలో ఏడు మండలాలు ఉంటే కేవలం రెండు మండలాల్లోనే ఇళ్లను నిర్మించి ఇచ్చారు. మిగతా చోట్ల వివిధ కారణాలతో పనులు ప్రారంభం కాలేదు. చౌటుప్పల్ మండలానికి 222 ఇండ్లు మంజూరైనా దండుమల్కాపురంలో 72 ఇళ్లను మాత్రమే నిర్మించి ఇచ్చారు. నారాయణపురం మండలానికి 124 ఇళ్లు మంజూరైతే సర్వేల్‌లో 64 ఇళ్లను నిర్మించి ఇచ్చారు.



ఆత్మకూరు(ఎం) మండలం ఉప్పలపహాడ్‌లో గడ్డిమొలిచి, చెత్తాచెదారంతో నిండిపోయిన ఇవి డబుల్ బెడ్ రూం ఇళ్లే. 2018లో పనులు చేపట్టి ఇక్కడ ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసినా, మౌలిక సదుపాయాలు కల్పించలేదు. ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించకపోవడంతో మందుబాబులకు అడ్డాగా మారాయి.



మందుబాబులకు అడ్డాగా మారిన ఈగృహం డబుల్ బెడ్ రూం ఇళ్లలోనిదే. భూదాన్‌పోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలో నిర్మించిన ఈ ఇళ్లలో మౌలిక సదుపాయాలు కల్పించలేదు. వీటిని లబ్ధిదారులకు అప్పగించకపోవడంతో ఇక్కడే కాదు.. జిల్లాలో చాలా ప్రాంతాల్లో 'డబుల్' ఇళ్లది ఇదే పరిస్థితి.

ఏడాదిగా ఎదురు చూస్తున్నాం



డబుల్ బెడ్ రూం ఇంటి కోసం ఏడాదిగా ఎదురు చూస్తున్నాం. ఏడాది కిందటే ఎంపిక చేసినా ఇంతవరకు ఇంటిని అప్పగించలేదు. ప్రస్తుతం అద్దె చెల్లించలేని స్థితిలో ఉన్నాం. త్వరగా ఇల్లు కేటాయించాలి.

– వెంపటి భాగ్యలక్ష్మి, వంగపల్లి

భువనగిరిలో నెగ్గిన అవిశ్వాసం



అవిశ్వాసానికి అనుకూలంగా చేతులెత్తిన బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీలకు చెందిన 31మంది కౌన్సిలర్లు

- పదవులు కోల్పోయిన బీఆర్‌ఎస్ మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్
- అవిశ్వాసానికి మద్దతు తెలుపుతూ చేతులెత్తిన 31మంది కౌన్సిలర్లు
- సమావేశానికి హాజరుకాని చైర్మన్, వైస్ చైర్మన్, మరో ఇద్దరు కౌన్సిలర్లతో పాటు ఎక్స్ అఫీషియో సభ్యుడు



అవిశ్వాస సమావేశంలో పాల్గొనేందుకు క్యాంపు నుంచి భువనగిరికి వచ్చిన బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు

భువనగిరిటౌన్ : భువనగిరి మున్సిపాలిటీలో అవిశ్వాసం నెగ్గింది. మున్సిపాలిటీ చైర్మన్, వైస్ చైర్మన్‌పై 16మంది బీఆర్‌ఎస్ కౌన్సిలర్లు, బీజేపీ, కాంగ్రెస్ సభ్యులతో కలిసి సొంత పార్టీ వారిపై అవిశ్వాసం పెట్టారు. మున్సిపాలిటీలో ఎక్స్ అఫీషియో సభ్యులతో కలిపి 36 మంది సభ్యులుండగా మంగళవారం నిర్వహించిన అవిశ్వాస ప్రత్యేక సమావేశానికి 31మంది హాజరయ్యారు. 16 మంది బీఆర్‌ఎస్, 9 మంది కాంగ్రెస్, ఆరుగురు బీజేపీ కౌన్సిలర్లు ఓటింగ్‌లో పాల్గొన్నారు. వీరంతా చైర్మన్, వైస్ చైర్మన్‌పై అవిశ్వాసానికి మద్దతుగా చేతులెత్తారు. దీంతో అవిశ్వాసం నెగ్గినట్లు ప్రిసైడింగ్ అధికారి అమరేందర్ తెలిపారు. దీంతో బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన చైర్మన్, వైస్ చైర్మన్ పదవులు కోల్పోయారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ భట్టు నాగిరెడ్డి ఉన్నారు.

అవిశ్వాస సమావేశం సాగిందిలా.

భువనగిరి మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌పై డిసెంబర్ 28న బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీ కౌన్సిలర్లు అవిశ్వాసం కోరుతూ కలెక్టర్‌కు నోటీసు అందజేయగా మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో భువనగిరి ఆర్డీఓ అమరేందర్ అధ్యక్షతన సమావేశం నిర్వ హించారు. ఎక్స్ అఫిషియో సభ్యులతో కలిపి 36మంది సభ్యులున్న కౌన్సిల్లో ఈ సమావేశానికి 31మంది హాజరయ్యారు. ఎక్స్ అఫిషియో సభ్యుడైన కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, ప్రస్తుతం చైర్మన్, వైస్ చైర్మన్‌తో పాటు కౌన్సిలర్లు చెన్నె స్వాతి, ఏవి కిరణ్‌కుమార్ గైర్హాజయ్యారు. హాజరైన వారిలో అవిశ్వాసానికి అనుకూలంగా 31మంది కౌన్సిలర్లు చేతులు పైకెత్తారు. అవిశ్వాసం నెగ్గిన వివరాలతో కూడిన నివేదికను అదనపు కలెక్టర్ ప్రభుత్వానికి పంపించారు. ఎన్నికల కమిషన్ నుంచి తదుపరి ఆదేశాలు రాగానే చైర్మన్ ఎన్నికకు 36 మంది సభ్యులకు నోటీసులు అందించనున్నారు. ఆ తర్వాత సమావేశం నిర్వహించి మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నిక నిర్వహించనున్నారు.



మళ్లీ క్యాంపునకు వెళ్తున్న కౌన్సిలర్లు

క్యాంపు నుంచి నేరుగా..

మున్సిపల్ అవిశ్వాసం సమావేశం నేపథ్యంలో బీఆర్‌ఎస్ పార్టీ కౌన్సిలర్లు క్యాంపునకు వెళ్లారు. వారు ఉదయం 10.30 గంటలకు ప్రత్యేక వాహనాల్లో నేరుగా మున్సిపల్ కార్యాలయానికి వచ్చారు. 10.40 కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు, 10.45కు బీజేపీ కౌన్సిలర్లు సమావేశ మందిరానికి చేరుకున్నారు.

పార్లమెంట్ ఎన్నికల నిర్వహణపై అధికారులకు శిక్షణ



శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

భువనగిరిటౌన్ : రాబోయే పార్లమెంట్ ఎన్నికల నిర్వహణలో భాగంగా ఎలక్షన్ సీజన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌ను పోర్టల్లో నమోదు చేసుకునే విధానంపై మంగళవారం వివిధ రాష్ట్రాల నోడల్ అధికారులు, జిల్లాల నోడల్ అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిస్టికల్ సర్వైవల్ టీములకు కేంద్ర ఎన్నికల కమిషన్ మాస్టర్ ట్రైనర్స్ ద్వారా అవగాహన, శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హనుమంతు కే.జెండగే, జిల్లా ఎక్సైజ్ అధికారి, జిల్లా పంచాయితీ అధికారి సునంద, జిల్లా స్థాయి మాస్టర్ ట్రైనర్స్ నర్సిరెడ్డి, హరినాథరెడ్డి, ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిస్టికల్ సర్వైవల్ టీముల సభ్యులు పాల్గొన్నారు.

పట్టభద్రుల అనాసక్తి !

ఎమ్మెల్సీ ఓటు నమోదుకు ముందుకురాని గ్రాడ్యుయేట్లు

- ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకున్న వారి సంఖ్య 8,156
- గత ఎన్నికల్లో 38,467 మంది ఓటర్లు
- దరఖాస్తుకు ఫిబ్రవరి 6 చివరి తేదీ
- ఓటరుగా నమోదు కావాలని అధికారుల విజ్ఞప్తి

సాక్షి, యాదాద్రి : పట్టభద్రుల ఓటు నమోదు జిల్లాలో మందకొడిగా సాగుతోంది. గ్రాడ్యుయేట్లు, ఉపాధ్యాయులు సైతం ఓటు నమోదుకు ఆసక్తి చూపడం లేదు. జిల్లా వ్యాప్తంగా 2021 మార్చిలో 38,467 మంది ఓటర్లు ఉండగా ప్రస్తుతం 8,156 మంది మాత్రమే ఇప్పటి వరకు ఓటు నమోదు చేసుకున్నారని అధికారిక లెక్కలు చెబుతున్నాయి. అధికారులు ఓటు నమోదు చేసుకోవాలని కోరుతున్నా గ్రాడ్యుయేట్లు ముందుకు రానట్లు కనిపిస్తోంది. కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఎన్నిక జరిగిన ప్రతిసారి పట్టభద్రులంతా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాల్సిందే. అందుకు గత నెల 30నుంచి ఓటు నమోదు కార్యక్రమానికి ఎన్నికల సంఘం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. వచ్చే నెల 6వ తేదీ వరకు తుది గడువు విధించింది. దాంతో అర్హులైన పట్టభద్రులంతా ఓటు హక్కు నమోదు చేసుకోవాలని ఎన్నికల సంఘం సూచిస్తోంది.

ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్‌లో..

ఓటరు నమోదు ఫారం–18ద్వారా ఆఫ్‌లైన్‌లేదా ఆన్‌లైన్‌లో దరఖాస్తులను స్వీకరించేందుకు ఏర్పాట్లు చేశారు. 2023 నవంబర్ 1 నాటికి డిగ్రీ పూర్తై మూడేండ్లు నిండిన వారందరూ దరఖాస్తుకు అర్హులు. ఫిబ్రవరి 6వ తేదీ నాటికి వచ్చిన దరఖాస్తులన్నింటినీ పరిశీలించిన అనంతరం అదే నెల 21న ఓటరు ముసాయిదా జాబితాను ప్రకటిస్తారు. ఈ జాబితాపై మార్చి 14వరకు అభ్యంతరాలను స్వీకరిస్తారు. వాటిని పరిష్కరించిన తర్వాత ఏప్రిల్ 4వ తేదీన తుది ఓటరు జాబితా విడుదల చేస్తారు. అనంతరం ఉప ఎన్నికల షెడ్యూల్ విడుదల కానుంది. ఏప్రిల్ చివరలో లేదా మే మొదటి వారంలో ఎన్నిక పూర్తి కావచ్చని అంచనా. జూన్ 8వ తేదీ లోపు ఉప ఎన్నిక ప్రకియ పూర్తి చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం గడువు విధించింది.

కొత్తగా ఓటు హక్కు నమోదు తప్పనిసరి

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక జరిగిన ప్రతిసారి గ్రాడ్యుయేట్‌లు కొత్తగా ఓటు హక్కు నమోదు చేయించుకోవాల్సి ఉంటుంది. 2021 మార్చిలో జరిగిన ఎన్నికల్లో ఓటు వేసాం అదే జాబితాతో ఓటు వేస్తామంటే అవకాశం లేదు. అందుకే ఓటుకు అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ తాజాగా దరఖాస్తు చేయాలని అధికార యంత్రాంగం సూచిస్తోంది. అధికారులు ఓటరు నమోదుకు ప్రత్యేక కార్యక్రమాలు రూపొందించారు.

దరఖాస్తుల స్వీకరణకు 34 కేంద్రాలు

జిల్లాలో గత ఎమ్మెల్సీ ఎన్నికల ఓటు నమోదు దరఖాస్తుల స్వీకరణకు మొత్తం 34పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. భువనగిరి రెవెన్యూ డివిజన్‌లో 21పోలింగ్ బూత్‌ల పరిధిలో 23,677 మంది దరఖాస్తు చేసుకోగా, చౌటుప్పల్ రెవెన్యూ డివిజన్‌లో 13 పోలింగ్ కేంద్రాల పరిధిలో 14,790 మంది ఓటు నమోదు చేసుకున్నారు. ప్రస్తుతం ఇప్పటి వరకు రెండు డివిజన్లలో కలిపి 8,156 మంది మాత్రమే ఓటు నమోదుకు దరఖాస్తు చేసుకున్నారు. ప్రస్తుతం ఉప ఎన్నిక కావడంతో ఏ మేరకు ఓటర్ల నమోదు జరుగుతుందనే వేచి చూడాలి. గత ఎన్నికల్లో వివిధ రాజకీయ పార్టీలు సైతం ప్రతిష్టాత్మకంగా తీసుకుని ఓటు నమోదుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఉప ఎన్నిక కావడంతో ఈ సారి ఇప్పటికైతే అలాంటి పరిస్థితి కనిపించడం లేదు. ఉప ఎన్నికపై రాజకీయ పార్టీలు, పోటీ చేయాలనుకునే ఆశావహులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

ఓటు నమోదు చేసుకోవాలి



ఎమ్మెల్సీ ఓటరు నమోదు జిల్లాలో మరింత పెరగాలి. ఇప్పటికే ఓటు నమోదుపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ప్రత్యేక ఓటు నమోదు కేంద్రాలను ఏర్పాటు చేసి బీఎల్‌ఓలను అందుబాటులో ఉంచాం. ఆన్‌లైన్, లేదా ఆఫ్‌లైన్ ద్వారా నమోదు చేసుకోవచ్చు. గత ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు వేసిన వారు కూడా మళ్లీ దరఖాస్తు చేసుకుంటేనే ఓటు హక్కు ఉంటుంది.

– భాస్కర్‌రావు, ఎన్నికల సహాయ రిటర్నింగ్ అధికారి

'పది'లో నూరుశాతం ఫలితాలకు కార్యాచరణ

- డీఈఓ నారాయణరెడ్డి

చౌటుప్పల్ : పదవ తరగతిలో నూరు శాతం ఫలితాలు సాధించేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేస్తున్నామని డీఈఓ నారాయణరెడ్డి తెలిపారు. అందులో భాగంగా ఉదయం, సాయంత్రం వేళల్లో విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. చౌటుప్పల్ మండల పరిధిలోని కొయ్యలగూడెం గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలను మంగళవారం ఆయన సందర్శించారు. మధ్యాహ్న భోజనాన్ని, వంటల తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రత్యేక తరగతుల్లో ఏ రోజు ఏ సబ్జెక్ట్ బోధించాలనే విషయాన్ని ఇప్పటికే నిర్ణయించామన్నారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని తెలిపారు. ఆయన వెంట ఎంఈఓ వి.శ్రీధర్, ఎస్‌ఎంసీ చైర్మన్ కైరంకొండ అశోక్, ప్రధానోపాధ్యాయుడు ఎస్.దుర్గయ్య, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



కొయ్యలగూడెం పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డీఈఓ నారాయణరెడ్డి

ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాలి

- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వీరారెడ్డి



ఇంద్రపాలనగరంలో పంచాయతీ రికార్డులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ వీరారెడ్డి

రామన్నపేట : ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా పనిచేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వీరారెడ్డి అన్నారు. రామన్నపేట మండలం ఇంద్రపాలనగరంలో మంగళవారం ఆయన పర్యటించారు. గ్రామపంచాయతీ రికార్డులను పరిశీలించారు. పంచాయతీ పన్నులను నూరుశాతం వసూలు చేయాలని ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రంతోపాటు పాఠశాలలను తనిఖీ చేశారు. పాఠశాలల మైదానంలో పల్లెప్రకృతి వనం ఏర్పాటుతో విద్యార్థులు అసౌకర్యానికి గురవుతున్నారని, నిర్వహణ లోపంతో విష పురుగులకు స్థావరంగా మారిందని స్థానికులు అదనపు కలెక్టర్‌కు తెలిపారు. అనంతరం ఆసిఫ్‌నహర్ కాలువ తూములను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీఓ జలేందర్‌రెడ్డి, ఎంపీఓ అంజిరెడ్డి, ఏపీఓ వెంకన్న మాజీసర్పంచ్ పూస బాలనర్సింహ, వార్డుసభ్యుడు యాదయ్య, కార్యదర్శి రసూల్ ఉన్నారు.

కాల్వల ఆధునీకరణకు నిధులు ఇవ్వండి

- మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డికి ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి వినతి



మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే

సాక్షి,యాదాద్రి : మూసీ కాలువల ఆధునీకరణకు బడ్జెట్లో నిధులు కేటాయించాలని భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తంకుమార్ రెడ్డిని కోరారు. ఈ మేరకు మంగళవారం సచివాలయంలో మంత్రికి వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గంలో ముందుకు సాగని బునాదిగాని, పిలాయపల్లి, ధర్మారెడ్డి కాల్వల ఆధునీకరణకు కూడా నిధులు ఇవ్వాలని కోరారు. వచ్చే బడ్జెట్లో బునాది గాని కాలువకు రూ.220 కోట్లు, పిలాయిపల్లి కాలువకు రు.60 కోట్లు, ధర్మారెడ్డి కాల్వకు రు.90 కోట్లు అవసరమవుతాయని అధికారులు రూపొందించిన అంచనాలను మంత్రికి అందజేశారు. ఎమ్మెల్యే వెంట నీటిపారుదల శాఖ ఎస్ఈ వేణుగోపాల్, డీఈ కృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

కుటుంబ సమస్యలతో వ్యక్తి ఆత్మహత్యాయత్నం

వలిగొండ: కుటుంబ సమస్యలతో వ్యక్తి ఆత్మహత్యాయత్నం చేశాడు. ఈ ఘటన వలిగొండ మండలంలోని టేకులసోమారం గ్రామంలో మంగళవారం జరిగింది. వివరాలు.. టేకుల సోమారం గ్రామానికి చెందిన చేగూరి శంకరయ్య మంగళవారం పొలం వద్ద పని చేస్తుండగా తన భార్యతో చిన్న గొడవ జరిగింది. దీంతో మనస్తాపానికి గురైన శంకరయ్య అక్కడే ఉన్న పొలంలో చల్లే అడుగు మందు తిని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు గమనించి వెంటనే 108 సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో వారు ఘటనా స్థలానికి చేరుకొని చికిత్స నిమిత్తం శంకరయ్యను భువనగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

చేతిలో టపాసులు పేలి వ్యక్తికి గాయాలు


గాయపడిన రవి

నేరేడుచర్ల: చేతిలో టపాసులు పేలి వ్యక్తికి గాయాలయ్యాయి. వివరాలు... నేరేడుచర్ల మున్సిపల్ చైర్మన్ చందమళ్ల జయబాబుపై పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గడంతో మంగళవారం పట్టణ కేంద్రంలో కాంగ్రెస్ కార్యకర్త రవి బాణసంచా కాల్చుతుండగా.. నిప్పు రవ్వలు వచ్చి రవి చేతిలో ఉన్న టపాసులకు అంటుకొని పేలడంతో అతడి కుడిచేతికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే రవిని కాంగ్రెస్ కార్యకర్తలు నేరేడుచర్లలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్‌లోని నిమ్స్ ఆస్పత్రికి తరలించారు.

విద్యుదాఘాతంతో ఆవు మృతి


మృతిచెందిన ఆవును పరిశీలిస్తున్న బాధిత రైతు

వలిగొండ: మండలంలోని సర్నాపురం మధిర వెంకన్నబావికి చెందిన రైతు నల్ల రాజ్‌కుమార్‌రెడ్డి పాడి ఆవు విద్యుదాఘాతంతో మంగళవారం మృతి చెందింది. రాజ్‌కుమార్‌రెడ్డి రోజు మాదిరిగానే ఆవును సోమవారం రాత్రి వ్యవసాయ బావి వద్ద కట్టేసి ఇంటికి వెళ్లాడు. మంగళవారం ఉదయం ఆవు తాడును తెంచుకొని వెళ్తుండగా.. బావి పక్కనే ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వైరు తగలడంతో విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందింది. ఆవు విలువ సుమారు రూ.85 వేలు ఉంటుందని బాధిత రైతు తెలిపాడు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

మునగాల: మండలంలోని ముకుందాపురం వద్ద జాతీయ రహదారిపై మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని గుంటూరుకు చెందిన కెవిన్ రాజు, కార్తీక్ బైక్‌పై హైదరాబాద్‌కు వెళ్తుండగా మార్గమధ్యలో మునగాల మండలం ముకుందాపురం వద్ద జాతీయ రహదారిపై బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇరువురికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు వీరిని 108 వాహనంలో చికిత్స నిమిత్తం కోదాడకు తరలించారు. కాగా వీరిలో కెవిన్ రాజు పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఈ ప్రమాదానికి సంబంధించి తమకు ఎటువంటి సమాచారం అందలేదని మునగాల పోలీసులు తెలిపారు.

90 కిలోల గంజాయి పట్టివేత

- ఒడిశా నుంచి ఢిల్లీకి తరలిస్తుండగా పంతంగి టోల్‌ప్లాజా వద్ద చిక్కిన నిందితులు
- ఇద్దరు నిందితుల అరెస్ట్
- కారు, రెండు సెల్‌ఫోన్‌లు స్వాధీనం


పట్టుబడిన కారులో నుంచి గంజాయి ప్యాకెట్లను బయటకు తీస్తున్న పోలీసులు


పోలీసులు స్వాధీనం చేసుకున్న కారు ఇదే..

చౌటుప్పల్: తక్కువ సమయంలో ఎక్కువ ఆదాయం పొందాలనే ఆశతో గంజాయి సరఫరా చేస్తున్న ఇద్దరు యువకులు పోలీసులకు చిక్కి జైలు పాలయ్యారు. వివరాలు.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని సాహిబాబాద్‌కు చెందిన మహ్మద్ రయీస్ అఫ్రిది రిక్షా కార్మికుడిగా పనిచేసేవాడు. మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని రేవా జిల్లా కుడారి గ్రామానికి చెందిన మిథిలేష్ సింగ్ డ్రైవర్‌గా పనిచేసేవాడు. వీరికి న్యూఢిల్లీకి చెందిన డ్రగ్స్ వ్యాపారి మెహరాజ్‌తో వేర్వేరుగా పరిచయం అయ్యింది. వారిద్దరికీ సదరు డ్రగ్స్ వ్యాపారి మాయమాటలు చెప్పి గంజాయి సరఫరా చేస్తే పెద్ద మొత్తంలో డబ్బు ఇస్తానని చెప్పాడు. వ్యాపారి చెప్పిన మాటలకు వారిద్దరు అంగీకరించడంతో వారిని పిలిచి ఒకరినొకరికి పరిచయం చేశాడు. అనంతరం వారికి పని అప్పగించాడు. డ్రగ్స్ వ్యాపారి చెప్పిన విధంగా రయీస్ అఫ్రిది, మిథిలేష్ సింగ్ గతేడాది డిసెంబర్ 6వ తేదీన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని రాజమండ్రికి కారులో వెళ్లారు. అక్కడ గంజాయి సరఫరా చేసే వ్యక్తులకు తమ కారును అప్పగించారు. తాము సమాచారం ఇచ్చినప్పుడు తిరిగి రావాలని గంజాయి సరఫరా చేసే వ్యక్తులు సూచించడంతో ఇద్దరూ కలిసి తమ స్వగ్రామాలకు వెళ్లిపోయారు. వారు అప్పగించిన కారులో గంజాయి రవాణా చేసేందుకు వీలుగా వ్యాపారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వెనుక డిక్కీ భాగంలో ఇనుప రేకులతో ప్రత్యేకంగా అరను ఏర్పాటు చేశారు. గంజాయి వ్యాపారుల పిలుపు మేరకు వారిద్దరు పది రోజుల క్రితం రాజమండ్రికి వెళ్లి సరుకు కోసం వేచి ఉన్నారు.

పంతంగి టోల్‌ప్లాజా వద్ద పట్టివేత..

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సరిహద్దు ప్రాంతమైన ఒడిశా రాష్ట్రానికి చెందిన ఓ గ్రామం నుంచి రాజమండ్రికి చెందిన వ్యాపారులు గంజాయిని సేకరించి ప్యాకెట్లుగా మార్చారు. కారు డిక్కీలో ఏర్పాటు చేసిన అరలో ప్యాకెట్లు పెట్టారు. డీఎల్ 02సీ ఏకే 5995 నంబర్ కలిగిన కారుకు ఏపీ 09 బీఎల్ 1556 నంబర్ ప్లేట్ పెట్టారు. తర్వాత కారును రయీస్ అఫ్రిది, మిథిలేష్ సింగ్‌కు అప్పగించారు. వారిద్దరు కారులో హైదరాబాద్ మీదుగా న్యూఢిల్లీకి బయల్దేరారు. ఈ క్రమంలో సోమవారం రాత్రి చౌటుప్పల్ మండలం పంతంగి టోల్‌ప్లాజా వద్దకు రాగానే అప్పటికే అక్కడ వాహనాలను తనిఖీ చేస్తున్న ఎల్‌బీనగర్–మహేశ్వరం ఎస్‌ఓటీ పోలీసులు, స్థానిక సివిల్ పోలీసులు వీరి కారును ఆపి పరిశీలించగా డిక్కీలో ప్రత్యేక అర కన్పించింది. దాంట్లో 90 కిలోల గంజాయి లభించింది. దీంతో పోలీసులు నిందితులిద్దరిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి కారు, రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితులను మంగళవారం స్థానిక కోర్టులో హాజరుపర్చి అక్కడి నుంచి నల్లగొండ జైలుకు తరలించారు. రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు పర్యవేక్షణలో మహేశ్వరం ఎస్‌ఓటీ డీసీపీ కె. మురళీధర్ ఆధ్వర్యంలో ఈ ఆపరేషన్ కొనసాగింది. ఈ మేరకు సీఐ ఎస్. దేవేందర్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి విక్రయిస్తున్న ఐదుగురి రిమాండ్


వివరాలను వెల్లడిస్తున్న సీఐ రాజశేఖర్

నకిరేకల్: నకిరేకల్‌లో గంజాయి విక్రయిస్తున్న ఐదుగురిని మంగళవారం స్థానిక పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. నకిరేకల్ పోలీస్ స్టేషన్‌లో సీఐ రాజశేఖర్ విలేకరులకు వెల్లడించిన వివరాల ప్రకారం.. నకిరేకల్‌కు చెందిన కృష్ణ, వహీద్ గల ఆరు నెలల నుంచి ఆంధ్రప్రదేశ్ నుంచి మధ్యవర్తి ద్వారా గంజాయి నకిరేకల్‌కు తీసుకొస్తున్నారు. ఇక్కడికి తీసుకొచ్చాక చిన్న చిన్న ప్యాకెట్లలో గంజాయిని కట్టి స్థానిక యువత, విద్యార్థులకు విక్రయిస్తున్నారు. వీరితో పాటు కట్టంగూర్, అడ్డగూడురు మండలాల్లోని కురుమర్తి, గట్టసింగారం గ్రామాలకు చెందిన మరో ముగ్గురు మైనర్లు కూడా ఈ దందాలో వారితో భాగస్వాములయ్యారు. వీరంతా మంగళవారం నకిరేకల్‌లోని నారాయణరెడ్డి ఫంక్షన్ హాల్ సమీపంలో గంజాయి విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో పోలీసులు మాటు వేసి పట్టుకున్నారు. వారి నుంచి 550 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఈ ముఠాలో ప్రధాన సూత్రదారులైన కృష్ణ, వహీద్‌తో పాటు మరో ముగ్గురు మైనర్లును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు. విలేకరుల సమావేశంలో ఎస్‌ఐలు సుధీర్ కుమార్, గోపికృష్ణ పాల్గొన్నారు.

బాలుడిపై హత్యాయత్నం

- తన చెల్లెల్ని ప్రేమిస్తున్నాడనే అనుమానంతో స్నేహితులతో కలిసి తీవ్రంగా కొట్టిన యువకుడు
- గొంతు నులమడంతో పాటు ఇనుప రాడ్డును కాల్చి వాతలు పెట్టిన వైనం


బాలుడి వీపుపై కన్పిస్తున్న వాతలు

భూదాన్‌పోచంపల్లి: తన చెల్లెల్ని ప్రేమిస్తున్నాడనే అనుమానంతో ఓ యువకుడు స్నేహితులతో కలిసి బాలుడిపై దాడిచేసి హత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ ఘటన సోమవారం రాత్రి భూదాన్‌పోచంపల్లిమున్సిపాలిటీ పరిధిలో జరిగింది. పోలీసులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పోచంపల్లి మున్సిపల్ కేంద్రంలోని బీసీ కాలనీకి చెందిన బాలుడు స్థానికంగా ఉన్న మోడల్ స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్నాడు. మోడల్ స్కూల్‌లోనే ఇంటర్ ఫస్టియర్ చదువుతున్న అదే కాలనీకి చెందిన విద్యార్థినితో అతడు చనువుగా ఉన్నాడు. అయితే తన చెల్లెల్ని ప్రేమిస్తున్నాడనే అనుమానంతో సదరు విద్యార్థిని అన్న ఆ బాలుడిపై కక్ష పెంచుకున్నాడు. సమయం కోసం వేచిచూశాడు. సోమవారం రాత్రి ముక్తాపూర్‌లో నిర్వహిస్తున్న అయోధ్య రాముడి ఊరేగింపు ర్యాలీని చూసేందుకు బాలుడు తన స్నేహితుడితో కలిసి బైక్‌పై వెళ్లారు. విషయం తెలుసుకొన్న విద్యార్థిని అన్న తన ఐదుగురు స్నేహితులతో కలిసి బాలుడిని బైక్‌పై బలవంతంగా ఎక్కించుకొని నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లి ఇనుపరాడ్డుతో తీవ్రంగా కొట్టి గాయపర్చారు. అంతటితో ఆగకుండా గొంతు నులిమి, ఇనుపరాడ్డును మంటలో కాల్చి బాలుడి కాళ్లపై వాతలు పెట్టారు. అడ్డుకోబోయిన బాలుడి స్నేహితుడిని కూడా కొట్టారు. తీవ్రంగా గాయపడిన బాలుడు మరో స్నేహితుడి సహాయంతో బైక్‌పై రాత్రి 10.30గంటలకు ఇంటికి చేరుకున్నాడు. అతని వీపు, కాళ్లపై గాయాలను చూసిన అతడి తండ్రి ఏమైందని ప్రశ్నించగా.. జరిగిన విషయం చెప్పాడు. దీంతో అదే రోజు రాత్రి పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేశారు. పోలీసులు తీవ్రంగా గాయపడిన బాలుడిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. బాలుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితులను చౌటుప్పల్ కోర్టు రిమాండ్ చేసినట్లు ఎస్‌ఐ విక్రమ్‌రెడ్డి తెలిపారు. అనంతరం నిందితులను నల్లగొండ సబ్ జైలు తరలించినట్లు ఎస్‌ఐ విక్రమ్‌రెడ్డి తెలిపారు.

కూలీలతో వెళ్తున్న ఆటోలు బోల్తా


మోతె: గాయపడిన మహిళా కూలీ


మేళ్లచెరువు: ఘటనా స్థలిలో గాయపడిన కూలీ

- మేళ్లచెరువు శివారులో జరిగిన ఘటనలో ఐదుగురికి..
- మోతె శివారులో జరిగిన ఘటనలో ఏడుగురికి గాయాలు

మేళ్లచెరువు: కూలీలతో వెళ్తున్న ఆటో బోల్తా పడడంతో ఐదుగురు గాయపడ్డారు. ఈ ఘటన మంగళవారం మేళ్లచెరువు శివారులోని హేమ్లాతండా క్రాస్ రోడ్ వద్ద జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కోదాడ పరిధిలోని సాలార్జంగ్‌పేటకు చెందిన 15 మంది కూలీలు మిరప తోటలో మిరపకాయలు కోసేందుకు మంగళవారం చింతలపాలెం మండలం వైపు ఆటోలో వెళ్తున్నారు. కాగా మేళ్లచెరువు శివారులోని హేమ్లాతండా క్రాస్ రోడ్ వద్దకు రాగానే వేగంగా ఎదురుగా వస్తున్న మరో ఆటోను తప్పించబోయి వీరి ఆటో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ఐదుగురికి గాయాలకు కాగా అందులో ఒకరిని చికిత్స నిమిత్తం సూర్యాపేట జిల్లా వైద్యశాలకు తరలించారు.

మోతె మండలంలోనూ..

మోతె: మండల కేంద్రానికి సమీపంలో మోతె–కేశవాపురం గ్రామాల మధ్య కూడా కూలీలతో వెళ్తున్న ఆటో బోల్తా పడడంతో ఏడుగురికి గాయాలయ్యాయి. వివరాలు.. నడిగూడెం గ్రామానికి చెందిన 18మంది కూలీలు మంగళవారం హుస్సేన్‌బాద్‌లో మిరప తోటలో మిరపకాయలు ఏరి తిరిగి సాయంత్రం ఇంటికి ఆటోలో వెళ్తున్నారు. ఈ క్రమంలో మోతె–కేశవాపురం గ్రామాల మధ్య పాశం వెంకన్న వ్యవసాయ భూమి వద్ద మూలమలుపు వద్దకు రాగానే ఆటో డ్రైవర్ ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో ఆటో బోల్తా పడింది. ఆటోలో ఉన్న 18మంది కూలీల్లో ఏడుగురికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనంలో సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించినట్లు సమాచారం.

గుర్తుతెలియని వృద్ధుడు మృతి

బీబీనగర్: మండలంలోని కొండమడుగు మెట్టు సమీ పంలో శ్రీసాయిరామ్ ట్రేడర్స్ దుకాణం వద్ద సోమవారం రాత్రి గుర్తుతెలియని వృద్ధుడు మృతిచెందాడు. ఎస్‌ఐ యుగేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. సుమారు 70సంవత్సరాలు కలిగిన గుర్తు తెలియని వృద్ధుడు రాత్రి సమయంలో దుకాణం వద్ద నిద్రలోనే మృతిచెందాడు. మృతుడు బిక్షాటన చేస్తూ సరైన ఆహారం దొరక్క మృతిచెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. గ్రామ వార్డు సభ్యుడు కడెం పాండురంగం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని భువనగిరి ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. మృతుడి వివరాలు తెలిసిన వారు 8712662473 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

మునగాల: మండలంలోని ఆకుపాముల శివారులో జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. మునగాల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మేళ్లచెరువు గ్రామానికి చెందిన రామకృష్ణ(25) టాటా ఏస్ వాహనంలో సూర్యాపేట నుంచి కోదాడ వైపు వెళ్తున్నాడు. మార్గమధ్యలో మునగాల మండలం ఆకుపాముల శివారులో గల రిలయన్స్ పెట్రోల్ బంకు వద్దకు చేరుకోగానే ముందు వెళ్తున్న ట్రాక్టర్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో రామకృష్ణకు బలమైన గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం స్థానికులు అతడిని ఖమ్మం పట్టణంలోని ఆస్పత్రికి తరలించగా పరిస్థితి విషమించి మంగళవారం మృతిచెందాడు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లుపోలీసులు తెలిపారు.

తప్పిపోయిన వృద్ధురాలిని కుటుంబ సభ్యులకు అప్పగింత


కుటుంబ సభ్యులకు వృద్ధురాలిని అప్పగిస్తున్న యూత్ సభ్యులు

మోతె: ఇంట్లో నుంచి తప్పిపోయిన వృద్ధురాలిని కుటుంబ సభ్యులకు యూత్ సభ్యులు, యువకులు గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. వివరాలు.. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం యాదగిరిపల్లి గ్రామానికి చెందిన మతిస్థిమితం లేని వృద్ధురాలు 12 రోజుల నుంచి మోతె గ్రామంలో తిరుగుతుండగా మంగళవారం మోతె యూత్ సభ్యులు, పలువురు యువకులు గమనించి ఆమె వివరాలు అడిగి తెలుసుకొని కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు. మోతెకు చేరుకున్న వృద్ధురాలి కుటుంబ సభ్యులకు ఆమెను అప్పజెప్పారు. అప్పగించిన వారిలో యూత్ సభ్యులు, గ్రామస్తులు పల్లెల లక్ష్మణ్, రాము తదితరులు ఉన్నారు.

బస్టాండ్లను పరిశుభ్రంగా ఉంచాలి

నల్లగొండ రూరల్ : బస్టాండ్‌లను పరిశుభ్రంగా ఉంచాలని ఆర్టీసీ ఈడీ పురుషోత్తంనాయక్ సూచించారు. మంగళవారం నల్లగొండ బస్టాండ్‌లో దుకాణాలు, టాయిలెట్లను ఆయన పరిశీలించారు. వస్తువులను ఎక్కువ ధరలకు అమ్మవద్దని దుకాణదారులను ఆదేశించారు. అంతకు ముందుకు ఉమ్మడి జిల్లాలోని డిపో మేనేజర్లతో సమావేశమయ్యారు. ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా తగు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మహాలక్ష్మి పథకం ద్వారా ప్రయాణికుల సంఖ్య పెరిగిన నేపథ్యంలో తగిన ప్రణాళికతో ముందుకు సాగాలని సూచించారు. సమావేశంలో ఆర్‌ఎం శ్రీదేవి, డిపో మేనేజర్లు రామోహ్మన్ రెడ్డి, ప్రేమ్‌కుమార్, హర్ష, శ్రీనివాస్, మాధవి, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.


నల్లగొండ బస్టాండ్‌లో దుకాణాలను తనిఖీ చేస్తున్న ఈడీ పురుషోత్తంనాయక్

బాల కార్మికులకు విముక్తి

చండూరు: మండలం పరిధిలోని ఇడికూడ, తాస్కానిగూడెం గ్రామాలలో ఇటుక బట్టీలపై నల్లగొండ ఆపరేషన్ స్మైల్ టీం ఎస్‌ఐ శంకరయ్య ఆధ్వర్యంలో మంగళవారం దాడులు నిర్వహించి ఓ బాల కార్మికుడిని గుర్తించారు. ఇటుక బట్టీల యజమానులు శ్రీనివాస్, లింగంపై కేసు నమోదు చేయాలని ఆయన చండూరు పోలీసులకు సిఫారసు చేశారు. ఈ కార్యక్రమంలో నాగేశ్వర్‌రావు, సతీష్ తదితరులు ఉన్నారు.

మిర్యాలగూడలో..

మిర్యాలగూడ టౌన్: మిర్యాలగూడ మండలం టీక్యాతండా సమీపంలోని ఇటుక బట్టీలపై ఆపరేషన్ స్మైల్ టీం ఎస్‌ఐ శోభన్‌బాబు ఆధ్వర్యంలో దాడులు నిర్వహించి ఓ బాల కార్మికుడికి విముక్తిని కల్పించారు.

మైనర్లతో పనులు చేయిస్తున్న ఇద్దరిపై కేసు

ఆలేరురూరల్: ఆలేరు బైపాస్ సమీపంలోని సాయిబాబ గుడి వద్ద గల సూపర్ సిమెంట్ వాల్ కంపెనీ యజమాని నూర్ ఆలం, పక్కనే ఉన్న ఇటుక బట్టీ యజమాని రాజు మైనర్లతో పనులు చేయిస్తుండడంతో వారిపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకటశ్రీను తెలిపారు. ఆపరేషన్ స్మైల్ బృందం ప్రతినిధి కొక్కలకొండ శ్రీకాంత్ జరిపిన విచారణలో మైనర్ బాలుడు, బాలికతో పనులు చేయిస్తున్నట్లు తేలడంతో ఆయన ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

ఉరేసుకుని ఇద్దరు ఆత్మహత్య

- రాజేంద్రనగర్ పరిధిలో ఘటన
- యువకుడు, వివాహిత బలవన్మరణానికి తెలియరాని కారణాలు
- మృతుల స్వస్థలం అడ్డగూడూరు మండలం ధర్మారం


స్రవంతి (ఫైల్)


శేఖర్ (ఫైల్)

రాజేంద్రనగర్: వారిద్దరు వరుసకు అక్కాతమ్ముడు అవుతారు. వారు మంగళవారం వేర్వేరు గదుల్లో ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డారు. ఈ ఘటన హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలం ధర్మారం గ్రామానికి చెందిన నర్సింహగౌడ్, సోమేశ్‌గౌడ్ అన్నదమ్ములు. పన్నెండేళ్ల క్రితం బతుకుదెరువు కోసం నగరానికి వలస వచ్చారు. రాజేంద్రనగర్ సర్కిల్ హైదర్‌గూడ కేశవ్ నగర్‌లో ఇల్లు కట్టుకుని కుటుంబ సభ్యులతో నివసిస్తున్నారు. పై అంతస్తులో నర్సింహ, స్వప్న దంపతులు తమ ఇద్దరు కుమారులతో పాటు స్వప్న తమ్ముడు శేఖర్(26) ఉంటుండగా.. కింది అంతస్తులో సోమేశ్, ఆయన భార్య స్రవంతి (28), వారి ఇద్దరు కుమారులతో కలిసి నివసిస్తున్నారు. నర్సింహ, సోమేశ్ అన్నదమ్ములిద్దరూ ప్రైవేటు జాబ్ చేస్తుండగా.. యువకుడు శేఖర్ ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నాడు. శేఖర్ స్వస్థలం కూడా ధర్మారం గ్రామమే.

పిల్లలు ఇంటికి వచ్చి చూడగా..

మంగళవారం స్వగ్రామంలో బంధువు దశదిన కర్మ ఉండటంతో నర్సింహ, సోమేశ్‌తో పాటు స్వప్న వెళ్లారు. ఉదయం పిల్లలను స్కూల్‌లో వదిలి వచ్చిన సోమేశ్ భార్య స్రవంతి ఇంట్లోనే ఉంది. మధ్యాహ్నం 3.30 గంటల ప్రాంతంలో స్రవంతి కుమారులు శశి, చందు ఇంటికి వచ్చి చూడగా తలుపులు తెరిచి ఉన్నాయి. గది లోపలి వెళ్లగా తల్లి ఉరేసుకొని వేలాడుతూ కనిపించింది. భయంతో వెంటనే బయటికి వచ్చి పక్కింటి వారితో ఈ విషయం చెప్పారు. వారు సోమేశ్‌కు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న రాజేంద్రనగర్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. హాల్‌లో స్రవంతి ఉరివేసుకోగా.. బెడ్రూంలో శేఖర్ ఉరివేసుకుని విగత జీవులై కనిపించారు. పోలీసులు పంచనామా చేసి ఇరువురి మృతదేహాలను ఉస్మానియా మార్చురీకి తరలించారు. విషయం తెలుసుకున్న నర్సింహ, సోమేశ్, స్వప్న ఇంటికి చేరుకున్నారు. స్రవంతి, శేఖర్ ఆత్మహత్యకు కారణాలు తెలియడంలేదని, తామంతా కలిసిమెలిసి ఉండేవాళ్లమన్నారు. శేఖర్ ఐదేళ్లుగా తమతోనే ఉంటున్నాడని నర్సింహ, సోమేష్ వెల్లడించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మోనిక పేర్కొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి

- మరో ముగ్గురికి తీవ్ర గాయాలు


అయిలయ్య (ఫైల్)


ధర్నా చేస్తున్న జలాల్‌పూర్ గ్రామస్తులు

బొమ్మలరామారం: రెండు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొనడంతో ఒకరు మృతిచెందగా.. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన బొమ్మలరామారం మండల కేంద్రంలో మంగళవారం జరిగింది. పోలీసులు స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... బొమ్మలరామారం మండలంలోని జలాల్‌పూర్ గ్రామానికి చెందిన మోటే అయిలయ్య(35) తన దివ్యాంగుల స్కూటీపై పని నిమిత్తం మండల కేంద్రానికి వచ్చి తిరిగి గ్రామానికి వెళ్తున్నాడు. అదేవిధంగా మండల కేంద్రానికి చెందిన నాగిరెడ్డి ప్రేమ్‌కుమార్‌రెడ్డి, మునిగల వెంకటేష్‌చారి బైక్‌పై చీకటిమామిడి వైపు నుంచి మండల కేంద్రానికి వెళ్తున్నారు. వీరి బైక్‌లు మండల కేంద్రంలోని పెట్రోల్ బంక్ సమీపంలో ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన మోటే అయిలయ్య అక్కడికక్కడే మృతిచెందాడు. ప్రేమ్‌కుమార్‌రెడ్డి, వెంకటేష్‌చారికి తీవ్ర గాయాలు కావడంతో స్థానికులు చికిత్స నిమిత్తం 108 వాహనంలో భువనగిరి జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.

న్యాయం చేయాలని ధర్నా..

వికలాంగుడైన మృతుడు మోటే అయిలయ్యకు రెండేళ్ల క్రితం వివాహం కాగా ఎనిమిది నెలల వయస్సు గల కొడుకు ఉన్నాడు. అయిలయ్య మృతితో అతడి కుటుంబం ఆధారం కోల్పోయిందని.. న్యాయం చేయాలని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు ఘటనా స్థలంలో రోడ్డుపై ధర్నా చేశారు. భువనగిరి టౌన్ సీఐ సుధీర్‌కృష్ణ అక్కడకు చేరుకుని న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

బైక్ అదుపుతప్పి..

అడ్డగూడూరు: బైక్‌పై వెళ్తూ అదుపుతప్పి కిందపడడంతో వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మంగళవారం రాత్రి అడ్డగూడూరు మండలం మానాయికుంట గ్రామ శివారులో జరిగింది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ధర్మారం అడ్డగూడూరు మండలంలోని ధర్మారం గ్రామానికి చెందిన కన్నెబోయిన లింగయ్య(50) బైక్‌పై శాలిగౌరారం మండలంలోని లింగోటం గ్రామానికి వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తుండగా మానాయికుంట గ్రామ శివారులో బైక్ అదుపుతప్పడంతో కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో లింగయ్య తలకు తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు 108 వాహనంలో అతడిని సూర్యాపేట ఏరియా ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతిచెందాడు.

యూటర్న్ తీసుకుంటుండగా..

నార్కట్‌పల్లి: జాతీయ రహదారిపై యూటర్న్ తీసకుంటుండగా లారీ ఢీకొని ఒకరు మృతిచెందారు. ఈ ఘటన మంగళవారం నార్కట్‌పల్లి మండలంలోని గోపలాయపల్లి వద్ద జరిగింది. నార్కట్‌పల్లి ఏఎస్‌ఐ నర్సిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కట్టంగూర్ మండలం ఇస్మాయిల్‌పల్లి గ్రామానికి చెందిన రేఖల పాపయ్య(54), రేఖల మధుసూద గోపలాయపల్లి సమీపంలో జాతీయ రహదారి పక్కనే గల హోటల్‌లో భోజనం చేశారు. భోజనం అనంతరం ఇరువురు బైక్‌పై వెళ్తూ గోపలాయిపల్లి ఆర్చీ వద్ద యూటర్న్ తీసుకుంటుండగా విజయవాడ నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న లారీ బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రేఖల పాపయ్య అక్కడిక్కడే మృతిచెందగా, మధుసూదకు తీవ్ర గాయాలయ్యాయి. మధుసూదను నార్కట్‌పల్లి కామినేని ఆస్పత్రికి తరలించారు. పాపయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమారుడు రేఖల శ్రవణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ నర్సిరెడ్డి తెలిపారు.

వంద పడకలుగా మార్చడానికి ఏర్పాట్లు చేయండి

- రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్


కోదాడ ప్రభుత్వ వైద్యశాలను పరిశీలిస్తున్న కమిషనర్ అజయ్‌కుమార్

కోదాడ: కోదాడలో ఉన్న 30 పడకల ప్రభుత్వ వైద్యశాలను వంద పడకలుగా మార్చడానికి అవసరమైన ఏర్పాట్లు చేయాలని రాష్ట్ర వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్‌కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం కోదాడ ప్రభుత్వ వైద్యశాలను ఆయన సందర్శించారు. కోదాడలో ప్రస్తుతం ఉన్న 30 పడకల వైద్యశాలను 100 పడకల వైద్యశాలగా మారుస్తూ ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. త్వరలోనే 100 పడకల వైద్యశాలకు శంకుస్థాపన చేయనున్నారు. ఈక్రమంలో వైద్యశాల స్థలాన్ని, అందులో ఉన్న నిర్మాణాలను, అక్కడ వంద పడకల వైద్యశాల ఏర్పాటుకు ఏమి చేయాలో అధికారులను అడిగి తెలుసుకున్నారు. వైద్యశాల స్థలంలో జరిగిన ఆక్రమణల విషయాన్ని సామాజిక కార్యకర్త బసవయ్య.. కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. ముందుగా వైద్యశాల స్థలాన్ని ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకొని క్రమ పద్ధతిలో వైద్యశాల నిర్మాణం చేయాలని కోరారు. కార్యక్రమంలో వైద్యశాల సూపరింటెండెంట్ దశరథనాయక్, డీసీహెచ్‌ఎస్ వెంకటేశ్వర్లు, డీఈఈ సూర్యానారాయణ, వైద్యులు పాల్గొన్నారు.

మట్టపల్లిలో నిత్యకల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి లక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మి చెంచులక్ష్మీ సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్య కల్యాణాన్ని మంగళవారం అర్చకులు వైభవంగా నిర్వహించారు. స్వామి అమ్మవార్లను నూతన పట్టు వస్త్రాలతో అలంకరించి ఎదుర్కోళ్ల మహోత్సవం చేపట్టారు. క్షేత్రపాలకుడైన శ్రీఆంజనేయస్వామికి తమలపాకుల పూజలు ప్రత్యేక అర్చనలు చేశారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్‌కుమార్, అర్చకులు పాల్గొన్నారు.